## క్లుప్తంగా

### సేవలు చిరస్మరణీయం

గద్వాల క్రైం: అంకిత భావంతో చేసే సేవలు చిరస్మరణీయమని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ వెంకటేశ్వర్లును ఎస్పీ సన్మానించారు. 34 సంవత్సరాలుగా పోలీసుశాఖలో ప్రజలకు సేవలు అందించారన్నారు. పలు విపత్కర సమయల్లో సైతం ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పోలీసుశాఖపై ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించారన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఉంటుందన్నారు. భవిష్యత్‌లో పోలీసుశాఖ నుంచి పూర్తి స్థాయిలో సహాయ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, కుటుంబ సభ్యులు ఉన్నారు.

### ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



రాజోళి: శ్రావణమాసం చివరి శనివారం కావడంతో మండల కేంద్రంలోని అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయ సమీపంలో వెలసిన ఇర్కంపల్లి ఆంజనేయ స్వామికి స్థానిక భక్తులు శనివారం విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి బిందె సేవలో భాగంగా భజనలు, సంకీర్తనలతో తుంగభద్ర నదికి నడుచుకుంటూ వెళ్లి, నది నుంచి నీటిని తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, ఆకు పూజ, అర్చన నిర్వహించారు. రామ కీర్తనలతో స్వామి ముందు విశేష కార్యక్రమాలు ఏర్పాటు చేసి, అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

### చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీఓ నాగరాణి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయంలో మల్దకల్, గట్టు, అయిజ అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదలకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పౌష్టికాహారం అందించడంతో పాటు వారు తీసుకుంటున్న ఆరోగ్య జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. గర్భిణీలలో రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్య, తెల్లమ్మ, వాసంతి, వెంకటేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### ఆరుబయట వంటతో అవస్థలు



అయిజ: ప్రభుత్వ పాఠశాలల వద్ద అధికారులు వంటశాలలు నిర్మించకపోవడంతో వంట ఏజెన్సీవారు వర్షాకాలంలో ఆరుబయట వంటలు చేస్తూ అవస్థలకు గురవుతున్నారు. మండలంలోని కిష్టాపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తేలికపాటి వర్షం కురుస్తున్నా పాఠశాల విద్యార్థులకు వంట ఏజెన్సీ వారు విద్యార్థులకు వంటచేయాల్సి వచ్చింది. వర్షానికి కట్టెట్లు తడిసి మంటమండని పరిస్థితి ఏర్పడింది. దీంతో వంటచేసేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద వంటశాలలను నిర్మించాలని వంట ఏజెన్సీ వారు కోరుతున్నారు.

### కస్తూర్బాకు ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలో కస్తూర్బా విద్యాలయానికి ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి దూరంలో ఉన్న ఈ విద్యాలయం ప్రహరీ లేకపోవడంతో బాలికలు రాత్రివేళలో బయటకు వచ్చేందుకు భయాందోళనకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రహరీ లేకపోవడంతో విద్యాలయ ఆవరణలోకి పందులు, పశువులు, గొర్రెలు సంచరిస్తూ పాఠశాల ఆవరణను అపరిశుభ్రం చేస్తున్నాయన్నారు. ఈ విషయమై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రహరీ పూర్తి స్థాయిలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కురుస్తున్న ముసురు వర్షాలు
- పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు
- స్తంభించిన రాకపోకలు



చిత్తడిగా మారిన పాతబస్టాండ్ కాలనీ



బురదమయంగా మారిన గట్టు బస్టాండ్

ఉండవెల్లి: మండలంలోని మోస్తరు వర్షం కురవడంతో రైతులు పొగాకు, మిరప, నారుమడి పనుల్లో నిమగ్నమయ్యారు. శనివారం కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చిన్న నాగమ్మ ఇంటి గోడ కూలీ రోడ్డుపై పడింది. దీంతో గోడపక్కనున్న ద్విచక్ర వాహనం దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు.

**ఎడ తెగని ముసురు వర్షం**

ధరూరు: మండలంలో రెండు రోజులుగా ముసురు వర్షాలు ఎడ తెగక కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గద్వాల ప్రాంతంలో అత్యధికంగా రైతులు సీడ్ పత్తిని సాగు చేయడంతో వర్షం ఆటంకంగా మారింది. కూలీలకు పనులకు వెళ్లకుండా నిలిచిపోయారు. పాత మిద్దెలు ఉన్న వారు భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలు స్కూళ్లకు వెళ్లేందుకు.. వృద్ధులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

గట్టు: తుఫాన్ కారణంగా ముసురు వర్షం పట్టుకుంది. దీంతో వ్యవసాయ పనులు చేసుకునే కూలీలు, రైతులు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం సాయంత్రం, రాత్రి కురిసిన వర్షం శనివారం 19 మి.మీ.గా నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వర్షం పట్టుకుంది. ముసురు వర్షానికి గట్టు బస్టాండ్ ప్రాంతం బురదమయంగా మారింది. పాదాచారులు ఇబ్బంది పడ్డారు. గట్టు చెరువుకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. ముసురు వర్షం కారణంగా సీడ్ పత్తి పొలాల్లో పనులు నిలిచాయి. వర్షపు చినుకులు పడుతున్న క్రమంలో క్రాసింగ్‌కు అవకాశం లేక పోవడంతో కూలీలు ఇంటికి చేరారు.

**చినుకుపడితే చిత్తడే**



పొగాకు నారుమడులలో రైతులు



ధరూరులో కురుస్తున్న వర్షం

అయిజ: పట్టణంలో తేలికపాటి వర్షం పడినా సరే ప్రధాన రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. శనివారం కురిసిన వర్షానికి పాతబస్టాండ్ ప్రధాన రహదారిపై వర్షంనీరు నిలిచిపోయింది. ఇటీవల రోడ్డుపై పడిన గుంతలను ఎర్రమట్టితో పూడ్చడంతో రోడ్డు బురదగా మారింది. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు అదుపుతప్పి కిందపడుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలకు తారు వేసి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఎర్రవల్లి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, ప్రయాణికులు వాగులను, వంకలను, గుంతలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, పాడుబడ్డ ఇళ్లలో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా సమస్యలుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 9100901605ను సంప్రదించాలని, లేదా స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

**వర్షాలతో జాగ్రత్తలు తీసుకోవాలి..**

గట్టు: ముసురు వర్షాల నేపథ్యంలో పాత ఇండ్లలో నివసించే వారు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ఎస్ఐ కేటీ మల్లేష్ విజ్ఞప్తి చేశారు. పాత ఇళ్లలో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. విద్యుత్ వైర్లు, స్తంభాలను తాక కూడదని తెలిపారు. చెట్లు, స్తంభాలు విరిగి పడితే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. భారీ వర్షాలకు చెరువులు, వాగులు పొంగిపొర్లితే అటు వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండకూడదని తెలిపారు.

శాంతినగర్: రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శాంతినగర్ ఎస్ఐ సంతోష్ సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున పాతబడ్డ ఇళ్లలో ఉండవద్దని, వర్షాలు తగ్గే వరకు బంధువుల ఇళ్లలో ఉండాలన్నారు.

# చేనేత కార్మికులకు చెక్కుల అందజేత



చెక్కులను గ్రూప్ లీడర్లకు అందజేస్తున్న ఏడీ గోవిందయ్య

రాజోళి: ఆందోళన చెందుతున్న చేనేత కార్మికులకు శనివారం ఊరట లభించింది. చేనేత త్రిఫ్ట్ ఫండ్ పథకం ద్వారా కార్మికులు ఆర్‌డీ 1లో నగదు జమ చేశారు. ప్రభుత్వం ఆర్‌డీ 2లో జమ చేయాల్సి ఉండగా, 11 నెలలుగా నగదు జమ చేయలేదు. దీంతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం నుంచి 11 నెలలకు చెందిన ఆర్‌డీ–2 నగదు చెక్కులను శనివారం చేనేత, జౌళి శాఖ ఏడీ గోవిందయ్య, సంబంధిత గ్రూప్ లీడర్లకు అందచేశారు. జిల్లాలోని చేనేత కార్మికులకు ఈ చెక్కులతో ఊరట లభించిందని, పథకం గడువు ముగుస్తుందనుకునే సమయంలో ఆర్‌డీ–2 ఖాతాలో నగదును వేయకపోవడంతో ఎంతో ఆందోళన చెందినట్లు తెలిపారు. ప్రస్తుతం చెక్కులు అందచేయడం సంతోషంగా ఉందని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

# బీజేపీని బలోపేతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



జిల్లా కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

అయిజ: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో నమోదు చేయిద్దామని జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాసు అన్నారు. శనివారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాసు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్రమోదీ సెప్టెంబర్ 2న సభ్యత్వ నమోదు కార్యశాల ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యవర్గ సభ్యుడు లక్ష్మణాచారి, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి బూత్‌లో 200 మంది సభ్యత్వం చేయాలి**

శాంతినగర్: ప్రతి బూత్‌లో కనీసం 200 మందిని సభ్యత్వం చేర్పించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్న కార్యకర్తలకు సూచించారు. శాంతినగర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 2 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శిని నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు రాఘవేంద్ర, రంగస్వామి, తిరుమల్, పరుశరాముడు, తిక్కయ్య పాల్గొన్నారు.

**బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశం**

మానవపాడు: మండల కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మురళీకృష్ణ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బూత్‌స్థాయిలో 200 మందికి తగ్గకుండా సభ్యత్వ నమోదు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఈశ్వర్, రాజు, మధు, అశోక్, సుధాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

# కుటుంబ సభ్యుల వివరాలు తెలపండి



రైతులతో సెల్ఫీ తీసుకుంటున్న మండల వ్యవసాయ అధికారి జనార్దన్

అయిజ: రైతు కుటుంబ సభ్యుల వివరాలు వ్యవసాయ అధికారులకు చెప్పి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ కోరారు. శనివారం మండలంలోని మేడికొండ పులికల్ గ్రామాల్లో రైతు కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడారు.

ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి అర్హులై రుణమాఫీ కాని రైతులు వారి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. గ్రామాల వారీగా నమోదు చేయడానికి మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులు సెప్టెంబర్ 10వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీ మేడికొండ, పులికల్, కుటుకనూరు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమంలో రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగని రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, రైతు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

**ఇంటింటి సర్వే సకాలంలో పూర్తి చేయాలి**

కేటిదొడ్డి: ఇంటింటి సర్వే సకాలంలో పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారిణి మహలక్ష్మి అన్నారు. మండలంలోని కొండాపురంలో శనివారం వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి మహలక్ష్మి మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీ కాని రైతులు వివరాలు రైతు భరోసా, పంట రుణమాఫీ యాప్‌లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రియాంక, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి



గట్టు ఎస్ఐ కేటీ మల్లేష్

గట్టు: గణేష్ ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాలకు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ కేటీ మల్లేష్ తెలిపారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి పోలీస్ ప్రోటోకాల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలీసులు ఆన్‌లైన్ ద్వారా అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. మండపాలకు ఏర్పాటు చేసే విద్యుత్‌కు సంబంధించి నాణ్యమైన వైరును ఉపయోగించాలని, రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను ఉపయోగించాలన్నారు. మండపాల్లో డీజేకు అనుమతి లేదన్నారు.

ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో గణపతి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు పోలీస్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్, కోదండాపురం ఎస్ఐ స్వాతి తెలిపారు. మండపాల దగ్గర డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, తప్పకుండా విద్యుత్‌శాఖ నుంచి కరెంట్ కోసం అనుమతి తీసుకొని మీసేవ ద్వారా బిల్లులు చెల్లించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా పండుగను, చివర రోజు నిమజ్జనం ర్యాలీలు చేసుకోవాలన్నారు.

# మాక్ పార్లమెంట్ ఎన్నికలు



ఓటు వేయడం కోసం క్యూలైన్లో నిల్చున్న విద్యార్థులు



పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్న విద్యార్థులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు శనివారం పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాక్ పార్లమెంటరీ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల మాదిరిగానే విద్యార్థులను అభ్యర్థులుగా నిలిపి బ్యాలెట్ బాక్సులను వినియోగించి పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులంతా తమ ఓటర్ ఐడీ కార్డును చూయించి బ్యాలెట్ పత్రాలపై వేలి ముద్రలు వేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంపై విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై పూర్తిగా అవగాహన కలుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఓటు హక్కును ఏవిధంగా వినియోగించాలో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మధులిక రెడ్డి, ప్రిన్సిపల్స్ సంధ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

### బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేద్దాం

ఆత్మకూర్: బాల్యవివాహాల వల్ల ఎన్నో రకాల అనర్థాలు జరుగుతాయని, వాటిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోక్సో చట్టం, బాల్యవివాహాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిరక్షణ విభాగం కౌన్సిలర్ స్వరూప మాట్లాడుతూ.. బాల్యవివాహ నిషేధ చట్టం 2006 గురించి క్లుప్తంగా వివరించారు.

### బడీడు పిల్లలను బడికి పంపించాలి



కేటిదొడ్డి: బడి బయట పిల్లలను బడికి పంపించాలని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని కొండపూర్‌లో శనివారం ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి మోటివేషన్ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ యుగంధర్ పాల్గొన్నారు.

### ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



ఎర్రవల్లి: ఇటిక్యాల మండలంలోని షాబాద్ గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరై గ్రామ పెద్దలకు, యువకులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ బీమ్‌సేన్‌రావ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతిగొప్ప వరం పౌరహక్కులని, వాటిని కాపాడి ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. న్యాయం, ధర్మం, స్వేచ్ఛ, అవకాశాలు, అభ్యున్నతి అనేవి కేవలం కొంత మందికి, కొన్ని వర్గాలకు కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేలా పౌర హక్కులు ఉన్నాయని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# అలంపూర్‌లో బంద్ ప్రశాంతం



బంద్‌లో పాల్గొన్న నాయకులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలో శనివారం బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు నిరసనగా చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. జోగులాంబ దేవి ఆలయం నుంచి గాంధీచౌక్ మీదుగా చౌక్‌బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలు బంద్‌కు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న మారణకాండ, అత్యాచారాలకు నిరసనగా శాంతియుత ర్యాలీ చేపట్టామన్నారు. సీఐ రవిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజులతోపాటు ముగ్గురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు, నాగ మద్దిలేటి, రాజగోపాల్, ఈశ్వరయ్య, రమేష్‌గుప్తా, బంగారు లక్ష్మన్, సుధాకర్, నరేష్ యాదవు, రంగస్వామి, శరత్‌బాబు, శేషన్న, జగన్మోహన్ పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్



### గుంతను పూడ్చేదెప్పుడు?

అలంపూర్ పట్టణంలోని సంగమేశ్వర ఆలయ సమీపంలో నీటి పైపుల మరమ్మతుల కోసం రెండు రోజుల క్రితం రోడ్డుపై గుంత తీశారు. ఇంకా పనులు చేపట్టలేదు. గుంతను అలాగే వదిలేశారు. నిత్యం వాహనాలు, ప్రజలు తిరిగే చోటు కావడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి నీటి పైపుల మరమ్మతులు త్వరగా చేపట్టి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

– అలంపూర్ రూరల్

సంప్రదించాల్సిన అధికారి..: సరస్వతి, మున్సిపల్ కమిషనర్, అలంపూర్
సెల్: 8977533858



వేదానగర్ నియంత్రిక వద్ద..



జిల్లా కేంద్రంలోని గంటవీధి-డ్యాం రోడ్డులో చెట్ల పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్



సుంకులమ్మ మెట్టు-గంజిపేటకు వెళ్లేదారిలో..

## అల్లుకున్న నిర్లక్ష్యం

జిల్లా కేంద్రంలో విద్యుత్ తీగలను పచ్చదనం అల్లుకుని అత్యంత ప్రమాదకరంగా మారింది. హైటెన్షన్, లోటెన్షన్ వైర్లను చుట్టుముట్టేశాయి. కొన్ని చోట్ల నియంత్రకల పరిసరాల్లో చెట్ల పొదలు పెరిగి పందిరిలా కమ్మేశాయి. గాలిదుమారం, వర్షానికి చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని చెట్ల కొమ్మలు తొలగించారు. అల్లుకుపోయిన తీగలు, నియంత్రిక చుట్టు పెరిగిన పొదలు తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– గద్వాల అర్బన్